ప్రజాశక్తి

ఆదివారం 8 జనవరి 2023

5

అనంతపురం



నేడు గ్రూపు -1 ప్రిలిమినరీ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఏపీపీఎస్సీ గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లను పూర్తి చేశారు. జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ డా॥ఫక్కీరప్ప కాగినెల్లి శనివారం ఉదయం పరిశీలించారు. కేంద్రంలోని సౌకర్యాలు గురించి జెఎన్‌టియు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కబ్జాదారులను వదిలేసి..

పేదలపై ప్రతాపమా..!

◆ గుడిసెల తొలగింపు దుర్మార్గం
◆ ఆ స్థలంలోనే పేదలకు పట్టాలివ్వాలి
◆ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కబ్జాదారులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తుంటే పట్టించుకోని అధికారులు, పేదలు సెంటు స్థలంలో గుడిసెలు వేసుకుంటే ఆఘమేఘాలపై వచ్చి తొలగించడం దుర్మార్గమైన చర్యని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో ఇటీవల పేదలు వేసుకున్న గుడిసెలను కబ్జాదారులు తొలగించడాన్ని నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ నాయకులు వలీ, ప్రకాష్, మసూద్ మాట్లాడుతూ నగరం చుట్టుపక్కల కబ్జాదారులు యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీ పంచాయతీ సర్వే నెంబర్ 4/7ఎ, 4/7బి, 4/8ఎ, 4/8బిలో ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీనికి కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి తమదే అంటూ ఆ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను తెల్లవారుజామున తొలగించేశారని తెలిపారు. కబ్జాదారులు కోట్ల రూపాయలు విలువజేసే ప్రభుత్వ భూమిని కాజేయాలని చూస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని కాపాడి అందులో పేదలకు పట్టాలిచ్చి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలను కలుపుకుని సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, బాబు, వెంకటేష్, నాగభూషణం, రాజు, జీవరత్నం, రామాంజనేయులు, దేవా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

ఆర్‌డిఒకు సిపిఎం నాయకుల వినతి



ఆర్‌డిఓకు సమస్యను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశకి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నగరంలోని కార్యాలయంలో ఆర్‌డిఓ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 4-8ఎ, 4-7ఎ2, 4-7ఎ3, 4-7ఎపి, 4-71, 56-5, 58-6లో ప్రభుత్వ భూములను కొద్ది సంవత్సరాలుగా ఆక్రమించుకుని రూ.కోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. అలాగే కొడిమి, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. వీటిని నివారించి ఇల్లు లేని పేదలకు స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారం పంచాయతీలోని సర్వే నెంబర్ 165లో 3.47 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఇందులో పేదలు చాలా కాలంగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు వేసుకోవడానికి నివాసం ఉన్న పేదలను కొందరు బెదిరింపులు చేస్తున్నారని తెలిపారు. నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే జీవిస్తున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇదే పంచాయతీలోని 340 సర్వే నెంబర్‌లో 3-17 ఎకరాలు, 341, 258, 176, 190, 191, 193 సర్వే నెంబర్‌లో పదుల ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని తెలిపారు. కల్లూరు పంచాయతీల్లో 414 సర్వే నెంబర్‌లో 9.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు యత్నిస్తున్నారని తెలపారు. ఈ స్థలాలను కాపాడి పేదల నివాసాలకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో సర్వే నెంబర్ 790-1,2,3 లలో 4 ఎకరాల 50 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ గ్రామంలో ఇళ్లు లేని పేదలకు ఇవ్వాలన్నారు. కూడేరు మండలం, బ్రాహ్మణపల్లి పంచాయతీల్లో సర్వే నెంబర్ 11 లో 8 ఎకరాల 88 సెంట్లు, 10-2లో 4 ఎకరాల 45 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందన్నారు. అగ్రిగోల్డ్ సంస్థ ఈ స్థలాన్ని తమ ప్లాట్లలో కలుపుకుందన్నారు. అలాగే శింగనమల మండలంలోని నిదనవాడ గ్రామంలో సర్వే నెంబర్ 61, 79, తరిమెల గ్రామంలో సర్వే నెంబర్ 571, ఆనందరావుపేట గ్రామం పంచాయతీలో 55, 61 సర్వే నెంబర్‌లలో పేదలకు నివాసయోగ్యమైన ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూములు ఆక్రమణకు గురికాకుండా పేదల ఇంటి స్థలాలకు మంజూరు చేయించాలని కోరారు. సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడి నిరుపేదలకు ఉపయోగపడేలా చూడాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్‌డిఓ పరిశీలించి ప్రభుత్వ భూములను తప్పకుండా స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విప్ 'కాపు' పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు..

మార్కెట్ యార్డు ఛైర్మన్ భోజరాజునాయక్

డి.హీరేహాల్ : విప్ కాపు రామచంద్రారెడ్డిపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైసిపి నాయకులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో విప్ కాపు రామచంద్రారెడ్డి అండదండలతో వైసిపి నాయకులు ఇసుక దందా చేస్తున్నారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఎక్కువగా ఇసుక దందా సాగిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మండలంలో ఎక్కడా ఇసుక దందాసాగడం లేదన్నారు. అయితే కాలవ మాత్రం అనవసరంగా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పొన్నూరుస్వామి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతురెడ్డి, నాయకులు రాళ్ల తిమ్మారెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలంపాట

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మెచ్చిరి గ్రామం చెరువులో చేప పిల్లలు పెంచుకుని అమ్ముకోవడానికి హక్కులు కల్పించేందుకు శనివారం వేలంపాట నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజు తెలిపారు. వేలం పాటలో 9 మంది పాల్గొనగా, మెచ్చిరికి చెందిన రామన్న అత్యధికంగా రూ.23,500కు దక్కించుకున్నారు.

'జలకళకు విద్యుత్ కనెక్షన్ లేదు'



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

◆ రైతులే దీనిని భరించాలి
◆ జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారుల వెల్లడి
◆ పలు సమస్యలను ఏకరువు పెట్టిన సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జగనన్న జలకళకు ఇక నుంచి విద్యుత్ కనెక్షన్, మోటర్ల ఏర్పాట్లను లబ్ధిదారులే చూసుకోవాలని ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని అధికారులు వెల్లడించారు. మొదటి దశ వేసిన జలకళకు మాత్రం విద్యుత్ కనెక్షన్, మీటర్లు వేస్తామని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశం హాలులో శనివారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాచరణ్ శ్రీ, మండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు హాజరయ్యారు. రెండు జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి సెల్వరాజన్, బసంత్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలను ఏకరువు పెట్టారు. కంబదూరు జడ్పిటిసి మాట్లాడుతూ జలకళ కింద బోర్లు వేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్లు ఇంతవరకు ఇవ్వలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ నాగలక్ష్మి స్పందిస్తూ జలకళకు సంబంధించి విద్యుత్ కనెక్షన్ మొదటి విడతలో వేసిన బోర్లకు మాత్రమే ఇస్తామన్నారు. ఆ తరువాత విడతలో కేవలం బోర్లు మాత్రమే వేస్తారని, కనెక్షన్‌ను రైతులే తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆ రకంగా ప్రభుత్వ మార్గదర్శకాల్లో మార్పులు జరిగాయని వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా తప్పా ఇతర ఎరువులేవీ ఉండటం లేదని ఆమడగూరు జెడ్పీటీసీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అన్నింటినీ అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తి జెడ్పీటీసీ మాట్లాడుడుతూ సత్యసాయి జిల్లాలో ఉద్యానవన అధికారులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యానవన అధికారులు ఎందరున్నారో చెప్పాలని అధికారులను అడిగారు. దీనిపై ఉద్యానవన శాఖ ఎడి చంద్రశేఖర్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిధిలో మొత్తం పది మంది ఉద్యానవ అధికారుల పోస్టులు ఉన్నాయని, వీరిలో నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఒక్కో అధికారికి పది మండలాలకు ఇన్‌ఛార్జీగా వ్యవహరించాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేయిన్‌గన్‌లు, నీటి పైపులు ఎక్కడున్నాయో చెప్పాలని బెళుగుప్ప జెడ్పీటీసీ ప్రశ్నించారు. దీనిపై పదేపేద చర్చకు వస్తున్నా రికవరీ చేసే చర్యలు అధికారులు చేపట్టడం లేదని ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు తెలిపారు. ఇందుకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ రెయిన్‌గన్‌లు ఎక్కడున్నాయన్న దానిపై నివేదిక రూపొందించామని, అందులో 20 నుంచి 30 శాతంలోపే పనిచేసే విధంగా ఉన్నాయన్నారు. వాటి రికవరీకి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గృహ నిర్మాణ అంశంపై కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ అనంతపరం జిల్లాలో 60 వేల ఇళు మంజూరయితే ఆరు వేలు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వచ్చే ఉగాది నాటికి 20 వేల ఇళ్లు పూర్తి చేయాలన్నది లక్ష్యమని తెలిపారు. రెండు మాసాల వ్యవధిలో 14 వేల ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అందరి సహకారం అవసరం అవుతుందని చెప్పారు. అదే విధంగా 2024 నాటికి మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే కేంద్రమిచ్చిన నిధులు వెనక్కు వెళ్లే అవకాశాలున్నాయని, కావున లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించేందుకు ప్రయత్నించాలని సభ్యులను కోరారు. గృహ నిర్మాణ శాఖలో నిధుల కొరత లేదని అధికారులు సైతం చెబుతున్నారని, లేఅవుట్ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విధంగా అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ అంశంపై బుక్కరాయసముద్రం భాస్కర్ జెడ్పీటీసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు పౌష్టికాహారం లోపాలు అదే విధంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వం పౌష్టికాహారం ఇస్తున్నా ఎందుకు వారిలో ఆలోపాలు పోవడం లేదో పరిశీలించాలని కోరారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లు పూర్తి సమయం విధుల్లో ఉండటం లేదని, చర్యల తీసుకోవాలని కోరారు. దీనికి సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ ఇప్పుడు ఉద్యోగులందరికీ పేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది కాబట్టి, ఇక నుంచి పూర్తి సమయంలో ఉద్యోగులు ఉండాల్సి వస్తుందని చెప్పారు. ఇలా పలువురు సభ్యులు సమావేశంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

స్త్రీ,శిశుసంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ చరణ్



రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. జెడ్పీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్య అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాడు-నేడు ద్వారా నూతన అంగన్ వాడీల నిర్మాణం, ఇప్పటికే ఉన్న అంగన్ వాడీ భవనాల మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. అద్దె గదుల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు అద్దె ఖర్చుల కోసం ఎక్కువ మొత్తం చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన 'బాలామతం ప్లస్'ను రాష్ట్రంలోని ప్రతి పిల్లవాడికీ అందించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు తెలియజేశారు

ఇళ్ల స్థలాల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు



నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ శివారులోని ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని జగనన్న కాలనీలో సిపిఎం నాయకులు పర్యటించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఇటీవల మంజూరు చేసిన జగనన్న కాలనీలో ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. మిగిలినవి బేస్‌మట్టాలతో, ఖాళీ స్థలాలుగా దర్శనం ఇస్తున్నాయన్నారు. ఇళ్లు నిర్మించుకోకపోవడానికి ప్రధానంగా ఆర్థిక సమస్యలే అన్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఒక ఇల్లు పూర్తి కావాలంటే కనీసం రూ.6లక్షలు కావాల్సి వస్తోందన్నారు. ఈనేపథ్యంలో పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుంటున్న కొందరు వైసిపి వార్డు ఇన్‌ఛార్జిలు కాంట్రాక్టర్లుగా మారి నాసిరకంగా బేస్‌మట్టాలు నిర్మించి వచ్చే బిల్లులను బొక్కేస్తున్నారని ఆరోపించారు. అంతేగాకుండా ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను లబ్ధిదారులకు తెలియకుండా కబ్జా చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆక్రమణలపై తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి సోమవారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కమిటీ సభ్యులు సాకే నాగరాజు, జగ్గిలి రమేష్, తిమ్మప్ప, మల్లికార్జున, చరణ్, కిషోర్, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆర్‌జెడి ఎం.వెంకటకష్ణారెడ్డి



సమీక్షలో మాట్లాడుతన్న ఆర్‌జెడి ఎం.వెంకటకష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో వందశాతం ఉతీర్ణత సాధించాలని ఆర్‌జెడి, ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. అనంతపురం ఉప విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో నగరంలోని కొత్తూరు బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆశయం, ఆలోచన మేరకు పదవ తరగతిలో వందశాతం ఫలితాల సాధన కోసం డిసెంబర్ 14 నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది ఫలితాలు, అనంత సంకల్పం కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో డిసెంబర్ 30న సమీక్ష నిర్వహించామన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయుల స్థాయి వరకు బలమైన మెసేజ్ పంపడానికి ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు సొంతంగా సి, డి గ్రేడ్ పిల్లలను దృష్టిలో ఉంచుకుని స్టడీ మెటీరియల్ తయారు చేయాలన్నారు. ఒకటి, రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యే అవకాశం ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు.

జెఎన్‌టియులో కెరియర్ అడ్వాన్స్ స్కీమ్ ఉద్యోగోన్నతులు



ఉద్యోగోన్నతి పొందిన ప్రొఫెసర్లు

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియులోని పలువురు అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఎఎస్) పదోన్నత నియామక ఉత్తర్వులను ఉపకులపతి జి.రంగజనార్ధన రిజిస్ట్రార్ సి.శశిధర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఐదుగురిని అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్లుగా నియమిస్తూ నియామకపత్రాలను అందజేసినట్లు తెలిపారు. అలాగే 12 మంది సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.7వేల నుంచి రూ.8వేల అకడమిక్ గ్రేడ్ నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్టార్ సి.శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



జెడ్పీ ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

జడ్పీ ఛైర్‌పర్సన్‌ను కోరిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే జగనన్న ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇంటి స్థలాలకు అర్హులుగా అధికారులు గుర్తించి వారందరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరజమ్మను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ దరకాస్తు చేసుకున్న 90 రోజుల్లో పట్టాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇచ్చిందన్నారు. బీడు భూములు, సాగు చేసుకుంటున్న భూములకు సాగు పట్టాలు ఇస్తామని చెప్పినప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. పల్లెల నుంచి పట్టణాలకు వలసలు వచ్చిన వారిలో అత్యధిక మంది నగరంలో నివాసం ఉంటున్నారని తెలిపారు. అందుకే మంజూరైన ఇళ్లలో అత్యధికంగా 19,298 ఇళ్లు ఇక్కడే ఉన్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు మొత్తం ప్రభుత్వమే చేపడుతుందని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇళ్లు మంజూరైన తరువాత నిబంధనలు మార్చి రూ.1.80 లక్షలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని, లబ్ధదారులు పునాదులువేసుకోవాలని సూచించారన్నారు. పెరిగిన సిమెంట్, స్టీల్ ధరలు, ఇసుక కొరత, కొన్ని లేఅవుట్‌లలో కనీస సదుపాయాలు లేవన్నారు. ఎంపిక చేసిన స్థలాలు గ్రామాలకు దూరంగా ఉండటం వంటి సమస్యలు తోడవడంతో నిర్మాణాలు జరగడం లేదన్నారు. ఇళ్లు నిర్మించుకోకపోతే రద్దు చేసస్తామని, భవిష్యత్‌లో ప్రభుత్వ ఇళ్లు రావని అధికారులు లబ్ధిదారులుపై ఒత్తిడి పెంచారన్నారు. దీంతో 28 వేల మంది నిరుపేదలు తాము జగనన్న ఇళ్లు కట్టుకోలేమని అధికారులకు రాతపూర్వకంగా ఇచ్చారని తెలిపారు. జగనన్న ఇంటి నిర్మాణాలకు జరిగిన భూముల కొనుగోలులో అనేక అక్రమాలు జరిగినట్లు సిపిఎం దృష్టికి వచ్చిందన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కనీస సౌకర్యాలు రోడ్లు, విద్యుత్, పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. కూడేరు మండలం 535లో 120 మంది భూమిలేని నిరుపేదలు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని వీరికి సాగు పట్టా ఇవ్వాలని కోరారు. గార్లదిన్నె కోటంకలో 243లో 20 మంది, పెనకచెర్ల గ్రామంలో 527 సర్వే నెంబర్‌లో 11 మంది నిరుపేదలు భూమిని సాగు చేసుకుంటుంన్నారని వారికి సాగు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జెడ్పీ ఛైర్‌పర్సన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, జిల్లా నాయకులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.క్రిష్ణమూర్తి, కుళ్ళాయప్ప, నరసింహారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

'పివికెకె'లో ముగ్గుల పోటీలు

అనంతపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా రుద్రంపేటలోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాల యందు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సాధారణ ముగ్గులే కాకుండా ఎన్నో సందేశాత్మక, పర్యావరణహితమైన, రసాయన రహిత ముగ్గులు వేసి వీక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ..సాధారణంగా ముగ్గులతోనే పండుగలకు కళ వస్తుందన్నారు. సంక్రాంతి సందర్భంలో పెట్టే ముగ్గులే దీనికి ఉదాహరణ అన్నారు. మన భారతీయ ప్రాచీన సంప్రదాయాలను గౌరవించాలని, మనదేశ సంస్కృతికి అనుగుణంగా నడుచుకోవాలని, పెద్దలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కోశాధికారి పల్లె సింధూర, ప్రిన్సిపల్ డా.బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డా,రాఘవేంద్ర ప్రసాద్, ఏవో మనోహర్‌రెడ్డి, ఎంబిఎ అధ్యాపకులు దీపిక పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ఉరవకొండ : బూదగవి గ్రామంలోని శ్రీ సూర్య నారాయణస్వామి దేవస్థానానికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామ తులసి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రూ.44,189 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఆపుస్మా క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : అనంతపురం జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘం 2023 నూతన క్యాలెండర్‌ను ఆర్‌జెడి, ఇన్‌ఛార్జి డిఇఒ ఎం.వెంకట కృష్ణారెడ్డి చేతుల మీదుగా డిఇఒ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షులు కె.పుల్లారెడ్డి, కార్యదర్శి చంద్ర, కోశాధికారి ఇక్బాల్, శ్రీనాథ్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి 15వరకు గడువు

గార్లదిన్నె : కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ ఇకెవైసి పూర్తి చేసుకోవడానికి ఈనెల 15 తేదీ వరకు గడువు పెంచిందని, రైతులు ఇకెవైసి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 9962 మంది రైతులకుగాను 8226 మంది రైతులు ఇకెవైసి పూర్తి చేసుకున్నారన్నారు. ఇంకా 1736 మంది ఇకెవైసి పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. ఈనెల 15వ తేదీలోపు మీసేవ కేంద్రాల్లో గాని, గ్రామ సచివాలయాల్లో గాని రైతులు ఇకెవైసి చేసుకోవాలని సూచించారు.

చీకటి జీవోను రద్దుచేయాలి

నార్పల : ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడానికి ప్రదర్శనలు, సభలు, సమావేశాలు వేదికలుగా నిలుస్తాయని, వాటిని నిషేధిస్తూ ప్రభుత్వం కక్షపూరితంగా ప్రవేశపెట్టిన జీవో నెం.1ని వెంటనే రద్దు చేయాలని జనసేనపార్టీ శింగనమల నియోజకవర్గ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బ్రిటిష్ కాలంలోని జీవోలను తిరగతోడి రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతును నొక్కడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని హరించేలా జీవో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఇలాంటి జీవో తీసుకొచ్చి ఉంటే ఆయన యాత్ర సాగేదా.. అధికారంలోకి వచ్చేవారా అని ప్రశ్నించారు. జగన్‌కు ముఖ్యమంత్రి పీఠం పోతుందనే భయం పుట్టుకొచ్చిందన్నారు. అందుకే ప్రశ్నించే గొంతులు నొక్కడానికి చీకటి జీవోను తీసుకొచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జీవోను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

సంక్రాంతి సంబరాలు

అనంతపురం : ఇటుకలపల్లి గ్రామ సమీపంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల ఛైర్మన్ అనంత రాముడు, వైస్ ఛైర్మన్ రమేష్ హాజరయ్యారు. చిన్నారుల వేషధారణలు, సన్నాయి మేళం, గంగిరెద్దుల ద్వారా సీతారాముల కళ్యాణం, కోలాట నృత్యాలు, గొబ్బెమ్మ పాటలకు పిల్లల లయబద్ధ నృత్యాలు అలరించాయి. పిల్లలు గాలిపటాలను ఎగురవేశారు. అనంతరం ఛైర్మన్ అనంత రాముడు దంపతులు పిల్లలకు భోగి పళ్ళుపోసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఇఒ నరసింహారావు, ప్రిన్సిపల్ డాక్టర్ నలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భస్థ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ఉరవకొండ : గర్భస్థ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించుకున్నా శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని వైద్యాధికారి వెంకటేష్ నాయక్ హెచ్చరించారు. శనివారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆమిద్యాల పంచాయతీ పరిధిలోని మూలగిరిపల్లి గ్రామ అంగన్వాడీ సెంటర్లో గ్రామస్థాయి గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా గర్భంలో ఆడ శిశువు ఉన్నట్లు గుర్తించి అబార్షన్ చేయించుకుంటున్నారని తెలిపారు. ఇలా చేయడం వల్ల గర్భిణులకు ప్రాణాప్రాయం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భస్థ నిర్ధారణ పరీక్షలు, బలవంతపు అబార్షన్లు లాంటి సమస్యలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, అపోహాలు తొలగించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అప్రమత్తం చేస్తోందన్నారు.

సంక్షేమం తగ్గుతోందా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రకటించింది. ఇదే తమ మ్యానిపెస్టో అని కూడా ప్రకటించింది. దీని ప్రకారం పాలన సాగుతుందని చెప్పింది. అయితే ఈ సంక్షేమ పథకాలు అమలో ముందున్నంత ఊపు కనిపించడం లేదు. నిలువ నీడలేని నిరుపేదలందరికీ సొంతింటి కళ నెరవేరుస్తామని చెప్పింది. అయితే ఆచరణలో మూడున్నరేళ్లలో పూర్తయిన ఇళ్లు మొక్కుబడే అని చెప్పాలి. ఇళ్ల స్థలాల కేటాయింపులోనే తీరని జాప్యం జరుగుతూ వచ్చింది. అన్ని అవరోధాలు అధిగమించి 2021 జూలైలో జగనన్న ఇళ్లుపేరుతో పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు కేటాయించే కార్యక్రమం చేపట్టింది. వెంటనే ఇళ్లు నిర్మించి, 2022 నాటికి ఉగాదికే ఇళ్లు ఇస్తామని చెప్పింది. అయితే ఆచరణలో అమలు జరగలేదు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ముందుకు పడటం లేదు. లక్ష్యంలో కనీసం పదో వంతు కూడా పూర్తవలేదు. అనంతపురం జిల్లా వరకు చూస్తే మొత్తం 64463 ఇళ్లు మంజూరయితే కట్టింది కేవలం 5908 ఇళ్లు మాత్రమే. ఇంకా 53895 ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో 41940 ఇళ్లు మంజూరయితే 7788 ఇళ్లు పూర్తయ్యాయి. తక్కిన ఇళ్లన్నీ అరకొరగానే ఉన్నాయి. ఇంతలోనే ప్రభుత్వం ఈ ఉగాది నాటికి జిల్లాకు 20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఆచరణ సాధ్యమవుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అంటే ఈ ఏడాది ఉగాది మార్చి 22వ తేది అంటే 73 రోజులు ఉన్నాయి. దాదాపు 25 వేల ఇళ్ల నిర్మాణాలు రెండు జిల్లాల్లో కలిపి పూర్తి చేయాల్సి ఉంది. ఇది ఎంతవరకు సాధ్యమన్నది చూడాల్సి ఉంది. ఇంతలోనే అసలు సమస్య కూడాముందు కొస్తోందని అధికారులు హెచ్చరికలు సైతం చేస్తున్నారు. ఒకటిన్నర సంవత్సరంగా ఇళ్ల నిర్మాణాలు మంజూరై పనులు సాగలేదు. ఈ నిర్మాణాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుంది. ఇళ్లు పూర్తికాకపోతే కేంద్రం నిధులు 2024 మార్చికి వెనక్కు తీసుకుంటుందని హెచ్చరిస్తున్నారు. అంటే ఈ ఏడాది పూర్తి చేయలేకపోతే సమస్య మరింత ఇబ్బందికరంగా మారనుందని ఆందోళన సైతం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే నవరత్నాల్లో మరో రత్నం అయిన పింఛన్లకు కోతలు పెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. జనవరి మొదటనే 20 వేల పింఛన్లకు ఎసరు పెట్టే ఆలోచన ప్రభుత్వం చేసిందన్న ఆరోపణలున్నాయి. అయితే చివరి నిమిషంలో మారినప్పటికీ రాబోయే రోజుల్లో ఉంటుందన్న ప్రచారం మాత్రం సాగుతూనే ఉంది. దీని తరువాత జలకళ రైతులకు ఉచితంగా బోర్లు, విద్యుత్ మీటర్లు ఇస్తామని ప్రభుత్వం



ప్రకటించింది. మొదటి విడతకు మంజూర చేసినట్టు చేసి రెండో విడతకు వచ్చే సరికి విద్యుత్ కనెక్షన్, మోటర్లకు కోత పెట్టింది. అయ్యే ఖర్చులో విద్యుత్ కనెక్షన్, మోటర్లకే అధికంగా ఖర్చు అవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. మొదటి విడతలో అనంతపురం జిల్లాలో 1475 బోర్లు తవ్వారు. సత్యసాయి జిల్లాలో 495 తవ్వారు. ఇప్పుడు లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇలా సంక్షేమ పథకాలకు కోతలు పడుతూపోతుండటం గమనార్హం. ప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రకటనలు చేస్తునప్పటికీ ఆచరణలో కోతలు మాత్రం పడుతూ పోతున్నాయి.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారమివ్వాలి



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

544 డి రోడ్డు నిర్వాసితులైన రోటరీపురం, కొర్రపాడు గ్రామస్తులకు ఎకరాకు రూ.50 లక్షలు రూపాయలు, ఇళ్లకు ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఆర్‌డిఒకు నిర్వాశితులు వినతిచేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వాశితులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దారు మోహన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆర్డీవో మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారం పెంచాలని నిర్వాశితులు ఆర్డీవోను కోరారు. 2018లో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌లో అప్పటి ధరలకి ఆధారంగా నష్టపరిహారం రూ.8.75 లక్షలు నిర్ణయించారన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసి ఇప్పటికి ఐదు సంవత్సరాలు అయ్యిందన్నారు. భూముల విలువ పెరిగిందన్నారు. అన్ని రకాల ధరలు సిమెంటు, ఇసుక, ఇనుము, రాళ్లు, మేస్త్రీలు, కూలీల కూలి రేట్లు పెరిగాయన్నారు. ప్రస్తుత రేట్ల ప్రకారం పరిహారం ఇవ్వాలని, ఇల్లు కోల్పోయిన వారికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని, భూములకు ఎకరాకు రూ.3.50 లక్షలు ఇవ్వాలని కోరారు. 2014లో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల్లో మరో 30 మంది నష్టపరిహారం రావాల్సి ఉందన్నారు. ప్రస్తు రేట్ల ప్రకారం వారికి పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఓ నల్లప్ప, రైతుసంఘం జిల్లా నాయకులు వి.శివారెడ్డి, ఆర్.కుళ్లాయప్ప, పుల్లయ్య, సంజీవరెడ్డి, నిర్వాసితులు ఉల్లిగంటి నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, మునియప్ప, శివారెడ్డి, కృష్ణ, రత్నమ్మ, రాము నెట్టికల్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను జెడ్. వీరారెడ్డి భవనంలో నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందన్నారు. వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్తు, బస్సు ఛార్జీలు పెంచడంతో సామాన్యులపై భారం పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.మల్లికార్జున, ఎస్.మున్నీ, ఎన్.రాజేశ్వరి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : సిపిఎం అనంతపురం జిల్లా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను సిపిఎం తాడిపత్రి మండల నాయకులు ఆవిష్కరించారు. శనివారం రూరల్ పరిధిలోని కడప రోడ్డులోని రామాలయం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా రైతులు, ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంవత్సర కాలంలో సిపిఎం చేపట్టిన కార్యక్రమాలు గుర్తు చేసుకుంటూ చిత్రాలను క్యాలెండర్‌లో పొందుపరిచామన్నారు. రైతులు, కార్మికుల హక్కులు తెలిసేలా క్యాలెండర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జగన్మోహన్ రెడ్డి, నాగరాజు, హనుమంతరెడ్డి, శ్రీరాములు పూసల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదమైన సూర్య దేవాలయ విలీనం

పోలీసుల సమక్షంలోనే రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలిసిన సూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వం దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవడంతో గ్రామంలో రెండు గ్రూపులుగా చీలిపోయి రథసప్తమి వేడుకలకు అభ్యంతరకరంగా మారి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సూర్య దేవాలయం అభివృద్ధి విషయంపై గ్రామంలో రెండు గ్రూపుల మధ్య వివాదం నెలకొని పోలీసులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. శనివారం గ్రామంలోని సూర్య దేవాలయం ఆవరణంలో ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశంపై, ఫిబ్రవరి నెలలో జరిగే రథసప్తమి వేడుకలు గురించి చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఉరవకొండ ఎస్ఐ వెంకటస్వామి మాట్లాడుతూ. సూర్య దేవాలయం దేవాదాయ శాఖ పరిధిలో విలీనం అయిందన్నారు. దేవాలయంలో జరిగే కార్యక్రమాలు అన్నీ వారి ఆధ్వర్యంలోనే జరుగుతాయని తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు. అయితే గ్రామంలో కొంతమంది మా గ్రామంలో వెలిసిన దేవాలయాన్ని మేమే అభివృద్ధి చేసుకుంటామన్నారు. గ్రామస్తుల అనుమతి లేకుండా దేవదాయ శాఖలోకి ఆలయాన్ని ఎందుకు విలీనం చేశారని ప్రశ్నించారు. మరో వర్గం వారు ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉండాలన్నారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. సిఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి జోక్యం చేసుకొని దేవాలయ విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగడం మంచిది కాదన్నారు. దేవదాయ శాఖ, గ్రామస్తుల సమన్వయంతో రథసప్తమి వేడుకలను జరుపుకోవాలని సూచించారు. రథసప్తమి తర్వాత సమస్యను పరిష్కరించుకుందామని చెప్పారు. దీంతో కొంతమంది దేవాదాయ శాఖ పరిధిలో జరుపుకోవడం తమకి ఇష్టం లేదంటూ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామతులసి, ఈవో కృష్ణయ్య, వైస్ ఎంపీపీ నరసింహులు, ఆలయ అభివృద్ధి నిర్వాహకులు అనంతశర్మ, ఆలయ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్దిచెబుతున్న సిఐ హరినాథ్

జెఎన్‌టియు అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల తోడ్పాటు

ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన



పూర్వ విద్యార్థులతో విసి రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థుల కలయికతోనే జేఎన్టీయూ కళాశాల అభివృద్ధి సాధ్యమని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం అనంతపురము జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం హాలు నందు 1983-87 సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జేఎన్టీయూ ప్రిన్సిపల్ ఆచార్య సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన మాట్లాడుతూ పూర్త విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ తోటి విద్యార్థులతో కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ బ్యాచ్ విద్యార్థులతోనే తాను తన కెరియర్‌ను ప్రారంభించానని తెలిపారు. అల్యూమిని అసోసియేషన్ కళాశాలకు బలమని, యూనివర్శిటీ అభివృద్ధిలో అల్యూమిని సభ్యుల సలహాలు, సూచనలు ఎప్పుడు తీసుకుంటామని తెలిపారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం కుటుంబంతో కలిసినటువంటి అనుభూతి ఉంటుందన్నారు. మాజీ యుపిఎస్‌సి మెంబర్ ఆచార్య వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలలో అనేక మంది అధ్యాపకులు గొప్ప అనుభవజ్ఞులని కొనియాడారు. ఈ కళాశాల వల్లనే అనేక పదవులు అధిరోహించానని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులను సన్మానించారు. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, మాజీ ఆచార్యులు ఆచార్య కృష్ణమాచారి, ఆచార్య కె.గోవింద రాజులు, ఆచార్య ప్రహ్లాద రావు, ఆచార్య వి.శంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ సృష్టించడమే ప్రభాకర్ చౌదరి పని : అనంత

ప్రజాశక్తి -అనంతపురం

ప్రజలు అధికారం ఇస్తే ఐదేళ్లు ఏమీ చేయలేని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి..ఇప్పుడు అంతా తానే చేసేసినట్టు బిల్డప్ ఇస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. నిజంగా అభివృద్ధి చేశారని ప్రజలు నమ్మివుంటే గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన్ను ఎందుకు ప్రజలు తిరస్కరించారో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. చివరకు కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా టీడీపీ నుంచి ఒక్కరూ కూడా గెలవలేదని, తమపై నమ్మకంతోనే ప్రజలు వైసీపీని గెలిపించారని తెలిపారు. శనివారం నగరంలోని 47వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభాకర్ చౌదరి ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఓటమిని అంగీకరించకుండా ఆధిపత్యం చెలాయిస్తూ ప్రజల్లో భ్రమలు కల్పిస్తూ బిల్డప్పులు ఇస్తున్నారన్నారు. బళ్లారి బైపాస్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా పంగల్ రోడ్డు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఫాదర్ ఫెర్రర్‌తో పాటు సర్ ఆర్థర్ కాటన్, శ్రీకృష్ణదేవరాయలు, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, వైఎస్ఆర్, పైడి లక్ష్మయ్య వంటి ఎంతో మంది మహనీయుల విగ్రహాలను తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు లోబడి ఆ విగ్రహాలన్నీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎన్‌హెచ్ అధికారులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే అనంత తెలిపారు. బళ్లారి బైపాస్ నుంచి నగరం మీదుగా పంగల్ రోడ్డు వరకు నేషనల్ హైవేస్ (ఎన్‌హెచ్)లోకి మార్చింది కూడా తామేనన్నారు. 'అధికారం ఉంటుంది.. పోతుంది.. కానీ మనం చేసిన అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. ఆ అభివృద్ధికి అడ్డుపడొద్దు' అని హితవు పలికారు.

జగనన్న గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని కొర్రపాడు, సిద్ధరాంపురం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను హౌసింగ్ డీఈఈ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ, ఎమ్మార్వో మోహన్‌కుమార్, ఎంపీడీవో తేజోత్న శనివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలనున త్వరితగతిన పూర్తిచేయాలని, కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక సక్రమంగా అందుతోందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది నాటికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ దామోదరమ్మ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, ఉపాధి హామీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె : జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని ఎంపీడీవో విజయభాస్కర్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా ఆయన ఎర్రగుంట్ల గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు.. అనంతరం ఆయన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్రవాహనాల చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. డిఎస్‌పి మహబూబ్ బాషా పర్యవేక్షణలో త్రీటౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ వలిబాషా, సిబ్బంది నగరంలోని తపోవనం వద్ద శనివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నుంచి రూ.4.60 లక్షలు విలువజేసే నాలుగు మోటారు సైకిళ్లను, మూడు సెల్‌ఫోన్లు, రూ.మూడు వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరం పట్టణం రేగాటిపల్లి సర్కిల్‌లోని నివాసముంటున్న పటాన్ మన్సూర్ ఖాన్ (19) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి తాగుడు, గంజాయి వినియోగించడం లాంటి చెడు వ్యసనాలున్నాయి. సెంట్రింగ్ పని వల్ల వచ్చే డబ్బులు అలవాట్లకు సరిపడేవి కావు. స్నేహితుల దగ్గర అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చుటకు, అతని అలవాట్లు తీర్చుకునేందుకు చిన్న చిన్న దొంగతనాలు మొదలెట్టాడు. రాత్రి వేళల్లో దేవాలయాల తలుపులు, షాపుల షట్టర్‌లను ఇనుప రాడ్డుతో పగులగొట్టి దొంగతనాలకు పాల్పడేవాడు. ధర్మవరం, అనంతపురము వన్ టౌన్, కొత్తచెరువు, నరిశీపట్నం లలో నేరాలకు పాల్పడ్డాడు. ఈ కేసులలో అరెస్ట్ అయ్యి జైలుకి వెళ్లొచ్చాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. మోటారు సైకిళ్ల దొంగతనాలు మొదలు పెట్టాడు. మారు తాళలను ఉపయోగించి మోటారు సైకిళ్లను అపహరించాడు. నిందితున్ని అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

రేవతి ఫెర్టిలైజర్స్‌పై చర్యలు తీసుకోవాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులకు నాసిరకమైన కంది విత్తనాలు పంపిణీ చేసిన అనంతపురం నగరంలోని రేవతి ఫెర్టిలైజర్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండ ఎడిఎ కార్యాలయం ఎదుట కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ అనంతపురంలోని రేవతి సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్‌లో ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామానికి చెందిన 20 మంది రైతులు కంది విత్తనాలు కొనుగోలు చేశారన్నారు. వారు 80 ఎకరాలలో కందిపంట సాగు చేశారన్నారు. సాగుచేసి ఆరు నెలలైనప్పటికీ పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. నాసిరకం విత్తనాలు పంపిణీ చేసి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు తలారి ఎల్లమ్మ, ఈశ్వరమ్మ, రామకృష్ణ, కొండన్న, ఎర్రి స్వామి, ఓబులేసు, వన్నూరప్ప, రామలక్ష్మి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసిగా రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం

కడప యోగివేమన యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా అనంతపురం జేఎన్టీయూ విసి ఆచార్య రంగజనార్ధనను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉన్నత విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జేఎన్టీయూ ఉపకులపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి యోగి వేమన యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వర్శిటీ బోధన బోధనేతర సిబ్బంది ఉపకులపతికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎపిజిఇఎ క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగుల సమాచారం అందించేలా క్యాలెండర్ రూపొందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.గోపికష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాము నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ రమణ కుమార్, నగర కమిటీ అధ్యక్షులు ఎం.షేక్‌రఫీ, నగర కార్యదర్శి ఓబి రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సాగు పట్టాలు ఇవ్వండి : వ్యకాసం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కూడేరు మండల పరిధిలో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు 8వ విడత భూపంపిణిలో సాగు పట్టాలు, అర్హులైన వారికి భూములు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కూడేరు మండల తహశీల్దార్ మధును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రిష్ణమూర్తి మాట్లాడుతూ కూడేరు మండలంలోని సాగు భూమిలేని పేదలు కూడేరు, కడదరకుంట, అరవకూరు, కమ్మూరు గ్రామాల్లో 20 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇందులో సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశులు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ

ఉరవకొండ : రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ అధికారి పెన్నయ్య పేర్కొన్నారు. శనివారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు, హవలిగి, ఉండబండ తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రబీ సీజన్‌లో విడపనకల్లు మండల వ్యాప్తంగా దాదాపు 20 వేల ఎకరాలలో పప్పు సెనగ పంటను సాగు చేశారన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 7200 ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసినట్లు పేర్కొన్నారు. పిఎం కిసాన్ సంబంధించి ఈ కేవైసీ చేయించుకోని రైతులు 4320 మంది ఉన్నారన్నారు. వారందరూ ఈనెల 14వ తేదీ లోపు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు కాలయాపన చేయకుండా వీలైనంత తొందరలో ఈ క్రాప్ బుకింగ్‌ను వంద శాతం పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాఘవేంద్ర, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ మునాఫ్, ఎంపీఈవోలు మేరీ, సౌందర్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను ఇబ్బందులకు గురిచేయొద్దు

గార్లదిన్నె : ప్రభుత్వ భూముల్లో పంటలు సాగుచేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీలను అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ..మండల పరిధిలోని కొప్పలకొండ గ్రామం సర్వే నెంబర్ 243 లోని 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీలు పంటలు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. అదే సర్వే నెంబర్‌లోని 33 ఎకరాల భూమిని అగ్రవర్ణాల వారు ఆక్రమించారన్నారు. దీనిపై ఏమీ మాట్లాడని అధికారులు ప్రభుత్వ భూమిలో దళితులు సాగుచేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దళితులను ఇబ్బందులకు గురిచేయడాన్ని ఆపకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగమ్మ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును అడ్డుకోవడం పిరికిపంద చర్య

పుట్లూరు : కుప్పంలో చంద్రబాబు పర్యటనను ప్రభుత్వం అడ్డుకోవడం పిరికిపంద చర్య అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చంద్రదండు ప్రకాష్‌నాయుడు పేర్కొన్నారు. జగన్ రెడ్డి విడుదల చేసిన చీకటి జీవో.నెం.1ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన చంద్రబాబును తన నియోజకవర్గంలో పర్యటించకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమేనన్నారు. వైసిపి ప్రభుత్వ వైఖరిని ప్రజలు క్షమించరన్నారు. రాబోవు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.